## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 11-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

### ముఖ్యాంశాలు

❖ వికసిత్ భారత్ దార్శనికత సాధన దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమిష్టి భాద్యత మరింత పెరిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

❖ ఒమన్ తీరానికి సమీపంలో భారతీయులున్న నౌకలపై జరిగిన దాడులను ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది.

❖ సరిహద్దు ప్రాంతాలలో సమాచార వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు.

❖ మొట్టమొదటి మేడిన్ ఇండియా ఎయిర్‌బస్ C-295 సైనిక రవాణా విమానాన్ని వడోదరలో ఈరోజు విజయవంతంగా పరీక్షించారు.

======================

వికసిత్ భారత్ దార్శనికత సాధన దిశగా కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాల సమిష్టి భాద్యత మరింత పెరగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని నీతి ఆయోగ్ 11వ పాలక మండలి సమావేశం ప్రధాని అధ్యక్షతన ఈరోజు జరిగింది. ఈ సమావేశానికి అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెట్ గవర్నర్లు, కేంద్ర మంత్రులు హాజరయ్యారు. సమావేశాన్ని ఉద్దేశించి ప్రధానమంత్రి మాట్లాడుతూ... ప్రపంచంలో అనిశ్చితి, అస్థిరతలు ఉన్నప్పటికీ భారతదేశం ఆత్మవిశ్వాసం, దృఢ సంకల్పంతో వృద్ధి పథంలో ముందుకు సాగుతోందని చెప్పారు. `వికసిత్ భారత్` దార్శనికత దిశగా రాష్ట్రాలు తమ ఆలోచనలను పంచుకోవడానికి, కలిసి పనిచేయడానికి వీలు కల్పించే ఒక సహకార వేదికగా నీతి ఆయోగ్ కీలక పాత్ర పోషించగలదన్నారు. నాణ్యమైన విద్య, డిమాండ్‌కు అనుగుణమైన నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల ద్వారా దేశ యువతకు సరైన వాతావరణాన్ని కల్పించడం వంటివి ప్రాధాన్యత కలిగి ఉండాలని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. సాధికారత పొందిన యువతే వికసిత్ భారత్ ప్రస్థానానికి చోదక శక్తిగా మారుతారని పేర్కొన్నారు. వృద్ధి, ఎగుమతులకు కొత్త అవకాశాలను సృష్టించేందుకు భారత్ అనేక దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేసిందని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఒమన్ తీరానికి సమీపంలో భారతీయులున్న నౌకలపై చేస్తున్న దాడులను ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఆ ఘటనలో ముగ్గురు భారతీయులను కోల్పోవడం పట్ల నిరసన వ్యక్తం చేసింది. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన అంతర్-మంత్రిత్వ శాఖ విలేకర్ల సమావేశంలో విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ... ఈ విషయమై భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయ ప్రతినిధులను పిలిచి తీవ్ర నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఒమన్ తీర ప్రాంతంలో నౌకలపై నిరంతరం జరుగుతున్న దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల ఫలితమే ఈ దాడులని పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి చర్చలు, దౌత్యం అవసరమని రణధీర్ జైస్వాల్ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

దాడులకు సంబంధించిన వివరాలను ఓడరేవుల మంత్రిత్వ శాఖ సహాయ కార్యదర్శి ముకేశ్ మంగళ్ వెల్లడించారు. ఈనెల 8 నుంచి దాడులు జరుగుతున్నాయని చెప్పారు. ఆరోజున మారివెక్స్ నౌకలో మంటలు చెలరేగాయని, అందులోని 24 మంది భారతీయులు సురక్షితంగా బయటపడ్డారని తెలిపారు. జూన్ 10న సెటిబె వాణిజ్య నౌకను అమెరికా సైన్యం లక్ష్యంగా చేసుకుందన్నారు. అలాగే ఈరోజు ఎంటీ జలవీర్ నౌకను లక్ష్యం చేసుకున్నారని... అందులోని 20 మంది భారతీయ సిబ్బంది సురక్షితంగా ఉన్నారని ప్రభుత్వం వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

మౌలిక సదుపాయాలపై దృష్టి సారిస్తూ.. సరిహద్దు ప్రాంతాలలో సమాచార వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. జైసల్మేర్ జిల్లాలోని రామ్‌గఢ్‌లో 20-kW FM ట్రాన్స్‌మీటర్‌ను జైపూర్‌లోని ఆకాశవాణి ప్రాంగణం నుండి వర్చువల్‌గా ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ కొత్త ట్రాన్స్‌మీటర్ ఏర్పాటుతో రాజస్థాన్ లో ట్రాన్స్‌మీటర్ల సంఖ్య 39కి చేరుకుంది. ఈ కార్యక్రమంలో ప్రసార భారతి చైర్మన్ ప్రసూన్ జోషి, ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ రాజీవ్ కుమార్ జైన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ... సరిహద్దు ప్రాంతాల పరిధి వరకు రేడియో ప్రసారాలను అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కాశ్మీర్ తో సహా దేశంలోని మొత్తం సరిహద్దు ప్రాంతాలకు సమగ్ర సమాచారాన్ని అందించడమే ఈ ప్రణాళిక లక్ష్యమని అశ్వినీ వైష్ణవ్ తెలియజేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ విమానయాన, రక్షణ రంగాల్లో సరికొత్త మైలురాయి నమోదైంది. మొట్టమొదటి మేడిన్ ఇండియా ఎయిర్‌బస్ C-295 సైనిక రవాణా విమానం తొలి పరీక్షను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఈరోజు గుజరాత్‌లోని వడోదరాలో ఫైనల్ అసెంబ్లీ లైన్ నుంచి ఈ చారిత్రాత్మక తొలి విమాన ప్రయాణం సాగింది. దీనిపై పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక విమానం ఆకాశంలోకి ఎగరడం మాత్రమే కాదని.. ఏరోస్పేస్ తయారీ రంగంలో దేశ శక్తి సామర్థ్యాలను ఇది ప్రతిబింబిస్తుందని సామాజిక మధ్యమ పోస్టులో
పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జీ-7 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు ఫ్రాన్స్, స్లోవేకియాల్లో పర్యటించనున్నారని విదేశాంగ మంత్రిత్వ శాఖ పశ్చిమ కార్యదర్శి సిబి జార్జ్ తెలిపారు. న్యూఢిల్లీలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఆహ్వానం మేరకు ఈ నెల 15 నుంచి 17 వరకు జరగనున్న 52వ జీ7 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు ప్రధానమంత్రి ఎవియాన్ నగరానికి వెళ్లనున్నారని తెలిపారు. ఈ సమావేశానికి భారతదేశాన్ని భాగస్వామ్య దేశంగా ఆహ్వానించారని చెప్పారు. ఈ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనే ప్రపంచ నాయకులతో, భారతదేశానికి, అలాగే గ్లోబల్ సౌత్‌కు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై ప్రధాని చర్చించడానికి ఈ పర్యటన ఒక అవకాశాన్ని కల్పిస్తుందని సిబి జార్జ్ వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

రైతుల సంక్షేమం ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యతల్లో ఒకటని.. వారి జీవనాన్ని సాధ్యమైనంత సులభతరం చేయడానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశ ఆహార భద్రత, పోషకాహారం, సమృద్ధికి రైతులు మూలస్తంభాలని సామాజిక మాధ్యమ పోస్టులో ప్రధాని పేర్కొన్నారు. `పిఎం-కిసాన్ సమ్మాన్ నిధి` పంటల బీమా పథకం వంటి కార్యక్రమాలు రైతుల ఆదాయాన్ని పరిరక్షించడమే కాకుండా, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని ప్రధాని తెలిపారు. `పిఎం-కుసుమ్` పథకం ద్వారా రైతులకు, వ్యవసాయ అవసరాలకు సౌరశక్తి అందుబాటులోకి రావడంతో పాటు, సంబంధిత ఖర్చులు కూడా తగ్గాయని నరేంద్రమోదీ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

2025-26లో భారత్ రికార్డు స్థాయిలో ఆహార ధాన్యాల ఉత్పత్తిని సాధించిందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. వరి, గోధుమల ఉత్పత్తి గరిష్ఠ స్థాయికి చేరుకుందని సామాజిక మధ్యమ పోస్టులో పేర్కొన్నారు. ఈ విజయం భారతదేశ ఆహార భద్రతను బలోపేతం చేస్తుందని, దేశ రైతులకు సాధికారత కల్పిస్తుందన్నారు. రైతులు తమ అంకితభావం, పట్టుదలతో దేశ ప్రగతికి నిరంతరం చోదకశక్తిగా నిలుస్తున్నారని అన్నారు. ఈ రికార్డు స్థాయి ఉత్పత్తి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని రైతు-కేంద్రీకృత కార్యక్రమాల పరివర్తనాత్మక ప్రభావాన్ని ప్రతిబింబిస్తుందని ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 73 వేల 983 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై.. చివరికి 151 పాయింట్ల నష్టంతో 73 వేల 832 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 53 పాయింట్లు నష్టపోయి 23 వేల 161 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95 రూపాయల 75 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 92 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4 వేల 092 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =